సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కురవని వర్షం..!

- ఎండుతున్న పంటలు
- వర్షం కోసం రైతుల ఎదురుచూపులు
- పత్తికొండ సబ్ డివిజన్ పరిధిలో 42,312 హెక్టార్లలో సాగు చేయలేదు

ప్రజాశక్తి-పత్తికొండ...

సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మే మాసంలో తొలకరి చినుకులు కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ సాగు చేయడానికి పొలాలను సిద్ధం చేశారు. మే ఆఖరివారం ,జూన్ మొదటి వారంలో జోరుగా వర్షం కురవడంతో పత్తి, వేరుశనగ, కంది, సజ్జ, మిరప, టమోటా ,ఉల్లి తదితర పంటలను రైతులు సాగు చేశారు. జూన్, జులై మాసాలలో వర్షాలు కురవకపోవడంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని కన్నీరు మున్నీరవుతున్నారు. గత వారం రోజులుగా ఈదురు గాలులు వీస్తుండడంతో పంటలు రోజురోజుకుకు నలిగిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు పంట వేసి 70 రోజులు అవుతున్నా సంపూర్ణమైన వాన లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పత్తి, టమోటా, వేరుశనగ, మిర్చి పంటలు సాగు చేయడానికి ఎకరాకు రూ.50 వేల నుండి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టారు. సజ్జ ,కంది, ఆముదం తదితర పంటలకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. పత్తికొండ వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని మండలాల వారీగా పత్తికొండ 16,840 హెక్టార్లకు గాని 14,314, తుగ్గలి 24,372 హెక్టార్లుగాను 17,356 మద్దికేర 9,300 హెక్టార్లకు గాను 6,788 దేవనకొండ 29,949 హెక్టార్లకు గాను 19,710 క్రిష్ణగిరి 26,075 హెక్టార్లకు గాను 71,802, వెల్దుర్తి 16,084 హెక్టార్లకు గాను 11,804 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 1,22,620 హెక్టార్లకు గాని 80308 పంట సాగు చేశారన్నారు. ఇంకా 42,312 హెక్టార్లలో రైతులు సాగు చేయలేదని వ్యవసాయ అధికారులు వివరాలను వెల్లడించారు. సాగుచేసిన పంటలకు పెట్టిన పెట్టుబడులు వస్తాయో రావో అని భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాదైనా చేసిన అప్పులు తీరుతాయో లేదోనని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించిన దాఖలు లేవని రైతులు మొరపెట్టుకుంటున్నారు.

వాడుముఖం పట్టిన పత్తి పైరు

కంది పంట సాగు చేయలేదు

- రైతు ఆంజనేయులు, మద్దికెర మండలం

రెండు ఎకరాలలో కంది సాగు చేయడానికి కందులు కొనుగోలు చేశాను. సకాలంలో వాన కురువకపోవడంతో కంది సాగు చేయలేదు. ఇప్పటివరక ఏ పంట వేయాలో దిక్కుతోచడం లేదు..

నష్టాలు చూడాల్సి వస్తుంది...

- రైతు ఆనంద్, ముక్కెళ్ల గ్రామం, తుగ్గలి మండలం

ఖరీఫ్ సీజన్‌లో 8 ఎకరాలలో కంది, ఆముదం, టమోటా సాగు చేశాను. దాదాపు 70 రోజులు నుండి సంపూర్ణమైన వాన లేదు. పంట సాగు చేయడానికి రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. సరైన వానలు లేక నష్టాలు చదవి చూడక తప్పదు.

సాగులో మెళకువలు పాటించాలి

- పత్తికొండ ఎడిఎ మోహన్ విజయ్ కుమార్

రైతులు సాగుచేసిన పంట పొలాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు, మెలుకవలు తప్పనిసరిగా పాటించాలి. వ్యవసాయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ ధృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం.

బ్యాంకుల భద్రతకు చర్యలు

- నేర నివారణే ప్రథమ లక్ష్యం
- దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు అవసరం
- ఖాతాదారులను హెచ్చరిస్తూ సైబర్ మోసాల గురించి తెలపాలి
- జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నేర నివారణే ప్రథమ లక్ష్యంగా కర్నూలు జిల్లాలోని అన్ని బ్యాంకులు పకడ్బందీ భద్రతను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ అన్నారు. బ్యాంకుల భద్రతా ప్రమాణాల పై ఎస్‌పి జిల్లాలోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం వ్యాస్ ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. ఇటీవల మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, హర్యానా వంటి పలు రాష్ట్రాలలో హైవే ప్రక్కన ఉన్న బ్యాంకుల్లో జరిగిన దొంగతనాలను గుర్తు చేశారు. అలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా బ్యాంకు అధికారులు పకడ్బందీగా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ.. బ్యాంకు లోపల, బయట అన్ని ప్రదేశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజా భద్రత చట్టం ప్రకారం మన్నిక కలిగిన సెన్సార్ సీసీ కెమెరాలు , బ్యాంకులలో దొంగలు పడిన వెంటనే అత్యవసర పరిస్థితుల్లో సెక్యూరిటీ అలారం మోగే విధంగా అందరూ అప్రమత్తం అయి బ్యాంకు వారికి మెసెజ్‌లు అలర్ట్స్ వచ్చే విధంగా భద్రతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి బ్యాంకులో సెక్యూరిటీ గార్డులు ఉండే విధంగా చూసుకోవాలన్నారు. లారీ డ్రైవర్స్ లారీలలో కార్లను డెలివరీ చేసేందుకు వచ్చి ఇతర రాష్ట్రాల నుండి వచ్చి దొంగలు దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. సెలవు రోజులలో రెక్కి చేస్తారన్నారు. కొందరి ఖాతాదారుల ఖాతాలలో అతి పెద్ద మొత్తాలలో లావాదేవీలు జరిగినప్పుడు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరగాళ్ల గురించి ఖాతా దారులను అప్రమత్తం చేయాలన్నారు. ఒటిపి ప్రాడ్స్, ఎపికె ఫైల్స్, డిజిటల్ ప్రాడ్స్, ఇన్వెస్టిమెంట్ ప్రాడ్స్ గురించి ఖాతాదారులకు బ్యాంకులలో హెచ్చరిస్తూ సైబర్ మోసాల గురించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులందరూ బ్యాంకులను సందర్శించి సెక్యూరిటీ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బ్యాంక్ అధికారులతో మాట్లాడాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ డిఎస్‌పి జె. బాబు ప్రసాద్, ఎస్‌బిఐ మేనేజర్ అబ్దుల్ రావూఫ్ , కరూర్ వైశ్య బ్యాంక్ పీరయ్య , స్పెషల్ బ్రాంచ్ సిఐ తేజమూర్తి , కర్నూలు పట్టణ సిఐలు రామయ్య నాయుడు, నాగరాజా రావు, శ్రీధర్, విక్రమ్ సింహా, చంద్రబాబు నాయుడు, మన్సురుద్దీన్ , నాగశేఖర్ , సైబర్ ల్యాబ్ సిఐ వేణుగోపాల్ , ఎస్ఐలు, సైబర్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గిరిజనుల అభివృద్ధికి ఆది కర్మయోగి అభియాన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఆదికర్మయోగి అభియాన్ పథకం అమలు పై వివిధ శాఖల అధికారులు, ఎంపిడిఒలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 35 వేల మంది గిరిజనులు ఉన్నారని, వీరికి అన్ని పథకాలు, సేవలు సంతృప్తస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య, ఆరోగ్యం, రోడ్లు, తాగునీరు, అటవీ, గృహాలు, మహిళా శిశు సంక్షేమం అంశాలకు సంబంధించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వీటితో పాటు సర్వీస్ డెలివరీకి సంబంధించి ఆధార్ లేనివారికి ఆధార్ క్యాస్ట్ సర్టిఫికెట్ ఇప్పించడంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించడం, పెన్షన్లు, అవసరం మేరకు లోన్ సౌకర్యం, ఇతర జీవనోపాదులు కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. ఆది కర్మయోగి, యోగి, సహాయోగీలను గుర్తించి, వీరికి శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్స్ ద్వారా గిరిజనుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పేద కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చే వారిని గుర్తించి మార్గదర్శులు గా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. మండల వారీగా కలెక్టర్ ఎంపిడిఓలతో మాట్లాడి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిటిడబ్ల్యు, కొండయ్య, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు, డిడబ్ల్యుఎంఎ పిడి రమణయ్య, డిఇఒ శామ్యూల్ పాల్, ఆర్ అండ్ బి ఎస్ఇ మహేశ్వర్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి నిర్మల, అగ్రికల్చర్ జెడి వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జెడి శ్రీనివాసులు, పిఆర్ఇఇ మద్దన్న, డిపిఒ భాస్కర్, ఎల్‌డిఎం రామచంద్ర రావు, ఎపిఎస్‌పిడిసిఎల్ ఇఇ ఓబులేష్, డిఆర్ఒ, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

2న అన్నదాత సుఖీభవ

ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ నిధులు జమ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో, తహసీల్దార్‌లతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 275749 మంది రైతులకు గాను 2107 మంది రైతులకు ఈ-కెవైసి పెండింగ్ ఉందన్నారు. వీరికి వెంటనే ఈ-కెవైసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌతాళం 258, హాలహర్వి 195, చిప్పగిరి 182, పత్తికొండ 180, ఆలూరు 172 పెండింగులో ఉన్నాయని, ఎందుకు పెండింగ్ ఉందని కలెక్టర్ సంబంధిత వ్యవసాయ అధికారులను ఆరా తీశారు. ఎన్‌పిసిఐ మ్యాపింగ్ కాని రైతులు 8755 మంది ఉన్నారన్నారు. రైతుల అకౌంట్లను ఆధార్ మ్యాపింగ్ చేసే విధంగా బ్యాంకు అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని కలెక్టర్ లీడ్ బ్యాంక్ మేనేజర్‌ను ఆదేశించారు.

తుంగభద్ర దిగువ కాలువ పై బ్రిడ్జి నిర్మాణం

కౌతాళం మండలం ఉరుకుంద-ఓబుళాపురం మార్గంలో ఉన్న తుంగభద్ర దిగువ కాలువపై ఉన్నటువంటి ఐరన్‌ఫుట్ బ్రిడ్జి కూలిపోయిందని పత్రికల్లో వచ్చిన వార్తలపై జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెంటనే స్పందించి మరమ్మతులు చేయించారు. బ్రిడ్జి సరిగా లేకపోవడం వల్ల పాదచారులు నడవడానికి ఇబ్బందిగా ఉందని, మూడు రోజుల క్రితం స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థుల్లో ఒకరు బ్రిడ్జికి పడిన రంధ్రం నుంచి నీటిలో పడిపోయారనే వార్తను చూసి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించి ఐరన్‌ఫుడ్ బ్రిడ్జి అందుబాటులోకి తేవాలని జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

పోరాటం చేయడమే కృష్ణకు నిజమైన నివాళి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ చార్జీల భారాలను ఇళ్ళకు స్మార్ట్ మీటర్లు పెట్టడానికి వ్యతిరేకించడమే బి.కృష్ణకు నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు అన్నారు. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్ లోఉన్న యువజన సంఘం కార్యాలయంలో బి.కృష్ణ 14వ వర్ధంతి సభ వార్డు నాయకులు ఎస్.రోశయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నాయకులు కుటుంబ సభ్యులు కార్యకర్తలు నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి. రాముడు మాట్లాడుతూ బి.కృష్ణ జీవితం యువతకు ఎంతో ఆదర్శమని అన్నారు. పేదలు నివసించే ప్రాంతమైన ఇందిరాగాంధీనగర్‌లో పుట్టి ప్రజల కష్టాలు చూసి ప్రజల కష్టాలను తెలుసుకొని అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా పాలకులపై అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. 2000 సంవత్సరంలో ఆనాటి చంద్రబాబు నాయుడు టిడిపి ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని వేయడాన్ని వ్యతిరేకిస్తూ అనేక పోరాటాలు చేశారన్నారు. చలో అసెంబ్లీ సందర్భంగా బషీర్ బాగ్‌లో జరిగిన కాల్పులలో కృష్ణ వీరోచితంగా పాల్గొని పోలీసు చేతిలో ఉన్న గన్నునులాక్కొని విసిరి వేశారని ఆయన గుర్తు చేశారు. కృష్ణలో ఉన్న పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి మేము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచండని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలోనే రూ.20వేల కోట్ల కరెంటు చార్జీల భారాన్ని ప్రజలపై వేశారని, దీనికి తోడుగా అదాని ఆస్తులు పెంచేందుకు ప్రజలపై బారాలు వేసేందుకు స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగిస్తున్నారని చెప్పారు. దానికి వ్యతిరేకంగా యువకులు ప్రజలు పోరాటాలలోకి రావాలని ప్రజలపై వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయడమే బి.కృష్ణకు నిజమైన నివాళి అని అన్నారు. ఆగస్టు 5న ఉదయం 10 గంటలకు జరుగు ధర్నాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు వి.శంకర్, కె.విక్రమ్, ఎస్. మైదుకూరు.హుస్సేన్‌బీ, అలివేలు,జమున, భాగ్యమ్మ, కృష్ణవేణి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

పిఎసిఎస్ ఛైర్మన్‌ను అభినందిస్తున్న గౌరు దంపతులు, సీడ్స్ ఛైర్మన్ డి.సుబ్బారెడ్డి

కల్లూరు సింగిల్ విండోస్ సొసైటీ చైర్మన్ గా దేవులంకాటి శేఖర్

-అభినందించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు సింగిల్ విండో సొసైటీ చైర్మన్‌గా దేవులంకాటి శేఖర్ ప్రమాణ స్వీకారం చేశారు. కర్నూలు పట్టణం రావూరి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో కల్లూరు పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ, చైర్మన్‌గా దేవాలంకాటి శేఖర్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ఎపిసీడ్స్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, ఉమ్మడి జిల్లా టిడిపి సీనియర్ నాయకులు, నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి గౌరు వెంకట రెడ్డి ,పలువురు నాయకులు, చైర్మన్లు నియోజకవర్గం పరిశీలకులు అదేన్న, పాణ్యం నియోజకవర్గం ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా సమస్య లేకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతులకు యూరియా పంపిణీలో సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన సమస్యలను నాణ్యతతో గడువు లోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోందని, నెగెటివ్ ఫీడ్ బ్యాక్ నిజమని తేలితే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఇళ్ళ నిర్మాణాలు పూర్తయ్యేలా నిరంతర కృషి చేయాలన్నారు.. హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు సంబంధించి మిగిలిన వాటికి అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్లు వెంటనే తీసుకోవాలని కలెక్టర్ డ్వామా పిడిని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ నీటి పన్నుకు సంబంధించి డేటా ఎంట్రీ పూర్తిచేయాలన్నారు. డిమాండ్ ప్రకారం పన్ను వసూలు చేసి చలానా కట్టించాలని తహసీల్దార్లను ఆదేశించారు.

అన్నాక్యాంటీన్ ఆకస్మిక పరిశీలన

కర్నూలు నగరంలోని స్థానిక పాత బస్టాండులో ఉన్న అన్న క్యాంటీన్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఆకస్మిక పరిశీలన చేశారు. ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ రుచికరమైన భోజనాన్ని పెట్టాలన్నారు. పక్కన ఉన్న పూల వ్యాపారం చేసుకునే వారితో జిల్లా కలెక్టర్ కొంతసేపు మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ వెంట కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూలమ్మే వారి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం

జిల్లా టిడిపి అధ్యక్షులు పి. తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం రాష్ట్రంలో ఈ నెల2న ప్రారంభమైన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం కర్నూలు జిల్లాలో టిడిపి శ్రేణులు ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టడంలో జిల్లాలో తమ పరిధిలో కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని టిడిపి కర్నూలు అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి వివరించారు. బుధవారం కర్నూలు జిల్లా టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్, కెవి.సుబ్బారెడ్డి, కెఇ.జగదీష్, ముంతాజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన పత్రికా, మీడియా ప్రతినిధుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. కర్నూలు జిల్లాలో పార్టీ వివిధ స్థాయిల నాయకులు ప్రజలను ఇంటింటికి వెళ్లి కలుసుకొని గడిచిన సంవత్సర కాలంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ఏమేరకు ప్రజలకు అందాయో తెలుసుకుంటున్నామన్నారు. ప్రజలు ఎదుర్కొనుచున్న సమస్యలను తెలుసుకోవడం ఎప్పటికప్పుడు వాటిని ఆన్‌లైన్‌లో పొందుపర్చామన్నారు. ఇతర నాయకులు మాట్లాడుతూ గత పరిస్థితుల నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు. వాగ్దానాలలో సామాజిక పెన్షన్ల పెంపు, అన్యాక్రాంతమైన భూములను కాపాడేందుకు జిఒ నెం.1 రద్దు, అన్నా క్యాంటీన్ల పునః ప్రారంభం, సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మెగా డిఎస్‌సి ద్వారా టీచర్ పోస్టుల భర్తీ, ఉచిత ఇసుక విధానం అమలు, తల్లికి వందనం కింద విద్యార్థి తల్లి ఖాతాలో రూ.13 వేల బ్యాంక్ అకౌంట్లో జమ వంటి హామీలు నెరవేర్చామన్నారు. ఇవికాక ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత కింద ఆర్థిక చేయూత వంటికి అమలవుతాయన్నారు. ముఖ్యమంత్రి కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాభివృద్ధికి చేపట్టిన గుండ్రేవుల, వేదవతి, ఆర్‌డిఎస్, ప్రాజెక్టులకు గతంలో టెండర్లను పిలిచామన్నారు. ప్రస్తుతం వాటి నిర్మాణం పనులకోసం ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. హంద్రీనీవా విస్తరణ పనులకోసం రూ.3800 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టామని గుర్తుచేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చారని, దేశ రక్షణకు సంభందించి డిఆర్‌డిఒ ద్వారా డ్రోన్ల ప్రయోగం కూడా ఇక్కడి నుండే జరిగిందని తెలిపారు. గత 2014-2019లో పేదలకోసం నిర్మించిన 10 వేల డిక్కో గృహాలను త్వరలోనే లబ్దిదారులకు అందజేశామన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు నందిమధు, పి.రవికుమార్, సత్రం రామక్రిష్ణుడు, డి.జేమ్స్, పుల్లయ్యచౌదరి, రామచంద్రనాయుడు, రాజశేఖర్, బేత క్రిష్ణుడు, హనుమంతరావుచౌదరి, ఎస్.షేక్షావలి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పి.తిక్కారెడ్డి, తదితరులు

పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 32వ వార్డు ముజాఫర్ నగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సిపిఎం ప్రతినిధి బృందం గురువారం పరిశీలించింది. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప ,నగర కమిటీ సభ్యులు ఎస్.హుస్సేన్‌బాష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాల తరహాలో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తామని నాలుగు రంగులు వేసి రంగుల ప్రపంచం చూపించడం తప్ప ప్రభుత్వ పాఠశాలలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయని విమర్శించారు. ముజఫర్ నగర్ హైస్కూల్లో 500 మంది విద్యార్థులకు తగ్గట్లు టాయిలెట్స్ లేక ఆరుబయటకు వెళ్లాల్సి వస్తుందన్నారు. అందువల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవు తున్నారని తెలిపారు. క్లాస్ రూమ్‌లలో ఫ్యాన్లు సరిగ్గా పనిచేయడం లేదని, పాఠాలు చెప్పే డిజిటల్ బోర్డుకు సరైన నెట్వర్క్ సౌకర్యం లేదన్నారు. ప్రధానంగా ఇంగ్లీష్, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించి టెన్త్‌క్లాస్ విద్యార్థులకు పూర్తిస్థాయిలో బుక్స్ అందలేదని బూట్లు ఇచ్చినా అవి అన్ సైజ్ ఉండడం వల్ల వెనక్కు పంపామని తెలిపారు. విద్యార్థులు తమ సమస్యలను సిపిఎం బృందం దష్టికి తెచ్చారు. ప్రధానంగా కల్లూరు, ముజఫర్‌నగర్ పందిపాడు లక్ష్మీపురం తదితర కాలనీలలో చదివే విద్యార్థులు టెన్త్ క్లాస్ తర్వాత ఇంటర్ చదువుకోవడానికి 10 కిలోమీటర్లు దూరంలో ఉన్న కోల్స్ కాలేజీ ,సెయింట్ జోసెఫ్ కాలేజీ ఉస్మానియా కాలేజీలకు వెళ్లాల్సి వస్తుందని, అందువల్ల ముజఫర్ నగర్ లో ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేస్తే విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, ముజఫర్ నగర్లో ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ కాలేజీకి తగిన రూములు కూడా ఉన్నాయని తెలిపారు. స్థానిక సిపిఎం కార్యకర్తలు కె సురేష్, ముని స్వామి, జె రాజు, యం మహేష్ పాల్గొన్నారు.

శరీన్ నగర్ : శరీన్‌నగర్‌లో స్కూల్ సర్వే చేశారు. స్కూలు సర్వేలో పాల్గొన్న నాయకులు సిపిఎం నగర నాయకులు జి.యేసు వార్డు నాయకులు జి.మౌలాలి ఎస్ జనులదిన్ కె.పెద్ద మధు, ఎస్.అమీర్ స్కూలులలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీచర్ల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు



విద్యార్థులకు వండిన అన్నాన్ని పరిశీలిస్తున్న నాయకుల

సాటి మనిషికి సాయపడాలి

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని డాక్టర్స్ కాలనీలోని బీసీ హాస్టల్ కు డాక్టర్ శంకర్ శర్మ ఫ్యాన్లను పంపిణీ చేశారు. బీసీ హాస్టల్ వార్డెన్ రమేష్ డాక్టర్ శంకర్ శర్మను కలిసి హాస్టల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన డాక్టర్ శంకర్ శర్మ గాయత్రీ ఎస్టేట్ లోని సాయి గురుదత్త పాలిక్లినిక్‌లో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే సీలింగ్ ఫ్యాన్లను వార్డెన్ రమేష్‌కు అందించారు. ఈసందర్భంగా డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ధనవంతులు పేదవారికి సహాయం చేయాడం వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. వెనుక బడిన రాష్ట్రంలో దాతలు సహాయం చేయాలని ముఖ్యమంత్రి సైతం సూచించారన్నారు. జపాన్ దేశంలో ఒకరికొకరు సహాయం చేసుకుంటారని తెలిపారు. ఏదైనా ఒక వస్తువు కొన్నప్పుడికన్నా ఇతరులకు ఇచ్చినప్పుడే ఎంతో సంతోషం కలుగుతుందన్నారు. పేదలకు సహాయం చేయడం వల్ల కొంతయినా పేదరికం పోతుందన్నారు. విద్యార్థులకు నేడు సహాయం చేయడం వల్ల భవిష్యత్తులో వారు ఇతరులకు సహాయం చేస్తారని తెలిపారు.


ఫ్యాన్లు సాయం చేస్తున్న డా॥ శంకర్‌శర్మ

ఐక్యంగా అభివాదం చేస్తున్న ఫ్యాప్టో సంఘాల నాయకులు

ఆగస్టు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అపరిష్కృతంగా ఉన్నటువంటి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల నేతలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు ఎస్‌టియు భవన్‌లో ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు జి.హృదయ రాజు కె. ప్రకాష్ రావు, జిల్లా చైర్మన్ సేవాలాల్ నాయక్, సెక్రటరీ జనరల్ భాస్కర్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, ఎస్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోకారి జనార్ధన్, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియానందం తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎంఈఓ1 పోస్టులను ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి కమిషన్‌ను కూడా వెంటనే ప్రకటించాలని, 11వ పిఆర్‌సి అరియర్స్ విడుదల చేయడమే కాకుండా ఐఆర్ కూడా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇటీవల బదిలీ, పదోన్నతి పొందిన టీచర్లకు వెంటనే జీతాలను చెల్లించాలన్నారు. ఆగస్టు 2న కలెక్టరేట్ వద్దజరిగే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

నిరసన చేపడుతున్న సిపిఎం నాయకులు

రోడ్డు గుంతలమయం..

- బాగు చేయాలని సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండ్ నుంచి సిరుగుప్ప చెక్‌పోస్ట్ వరకు ఆదోని – మాధవరం రోడ్డు పూర్తిగా గుంతలమయమయిందని, వర్షం వస్తే గుంతల్లో నీళ్లు నిలిచి వాహనాలు తిరగలేని పరిస్థితి ఉందని, రోడ్డును బాగు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ఐబి క్వార్టర్ ఎదుట రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్రాంతిలోపు రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఉండాలని కూటమి ప్రభుత్వం చెప్పిందని, ప్రస్తుతం శ్రావణమాసం, దసరా రాబోతున్నా రోడ్లను మాత్రం బాగు చేయడం లేదని తెలిపారు. కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం గుంతలమైన రోడ్లను బాగు చేయాలని, లేకపోతే రోడ్డును దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న, కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.గోపాల్, తిప్పన్న, వీరారెడ్డి, పట్టణ నాయకులు నాగరాజు, వెంకటేష్, మండల నాయకులు వెంకటేష్, వీరేష్, రమేష్, మల్లయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఈరన్న స్వామి సన్నిధిలో తిక్కా రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీక్షేత్ర ఉరుకుంద ఈరన్న స్వామిని టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కా రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణానికి చేరుకోగా దేవాలయం అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ సిబ్బంది శాలువా, పూలమాలలతో సన్మానించారు. అనంతరం శ్రావణమాసోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ కమిషనర్ విజయరాజును కోరారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, నాయకులు కొట్రేష్ గౌడ్, సుధీర్ రెడ్డి, కురుగోడు, రమేష్ గౌడ్, దొడ్డప్ప గౌడ్, సిద్ధు, రంగస్వామి, ఎరిగేరి చంద్ర పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న తిక్కారెడ్డి

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

- కెవిపిఎస్, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో సిఐటియు, కెవిపిఎస్ నాయకుల సమావేశం తిమ్మప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ప్రక్రియను నేటి కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని తెలిపారు. 'మేం అధికారంలోకి వస్తే విద్యుత్ సర్దుబాటు చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది. విద్యుత్ స్మార్ట్ మీటర్లను బద్దలు కొట్టండి' అని ఎన్నికల ప్రచారంలో మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదానీ సంస్థతో విద్యుత్ ఒప్పందం చేసుకున్నారని, ప్రస్తుతం వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. రాబోవు రోజుల్లో ఇళ్లకు బిగిస్తారని చెప్పారు. విద్యుత్ మీటర్లను పగలగొట్టండి అంటూ పిలుపునిచ్చిన లోకేష్ నేడు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఆంథోని, రాజా, రమేష్, బి.తిమ్మప్ప, ఎం.రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు మండల కార్యదర్శి రాముడు

9న జిల్లా మహాసభలు : సిపిఐ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆగస్టు 9 నుంచి 11 వరకు జరిగే సిపిఐ జిల్లా 24వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి, సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి కోరారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మహాసభ గోడపత్రికను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... హంద్రీనీవా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు రామాంజిని, రంగప్ప, బజారి, మహానంది, పెద్దయ్య పాల్గొన్నారు.

అక్రమాలకు చెక్..!

- ఇంటి పన్ను వసూళ్లలో పారదర్శకత
- 'స్వర్ణ పంచాయతీ' పేరుతో వెబ్‌సైట్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్లు, ఇతర ఆదాయాలకు సంబంధించి అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'స్వర్ణ పంచాయతీ' పేరుతో కొత్తగా వెబ్‌సైట్ రూపొందించి సంబంధిత పంచాయతీకి ఆన్‌లైన్‌లో పన్నుల చెల్లింపునకు శ్రీకారం చుట్టింది. పంచాయతీకి సంబంధించి అన్ని చెల్లింపులూ ఆన్‌లైన్‌లో నిర్వహించేలా డిజిటలైజేషన్ చేస్తోంది. పంచాయతీల పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరగనుంది.

'స్వర్ణ పంచాయతీ' వెబ్‌సైట్

పంచాయతీలకు ప్రభుత్వాలు ఇచ్చే ఆర్థిక సంఘాల నిధులు కాకుండా ఇళ్ల పన్నులే ప్రధాన ఆదాయ వనరు. వీటిని సాధారణ నిధులు అని కూడా అంటారు. ఇంకా దుకాణాల ఫీజులు, సంతల ఆశీలు, చెరువుల లీజు, సెల్ టవర్ల ఫీజు, పరిశ్రమల నుంచి ఆస్తి పన్ను వంటివి వస్తుంటాయి. పంచాయతీ సిబ్బంది ఇంతవరకు వీటిని నగదు రూపంలో నేరుగా ఆయా వ్యక్తులు, సంస్థల నుంచి వసూలు చేసేవారు. పంచాయతీ పరిధిలో ఎంత పన్ను వసూలు కావాలి, ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఎంత పన్ను వసూలైంది, బకాయిలు ఎంత, అన్న సమాచారం ఉండేది కాదు. దీనిని ఆసరాగా చేసుకుని కొంతమంది సిబ్బంది అవినీతికి పాల్పడడం, పంచాయతీ నిధులను సొంత అవసరాలకు వాడుకోవడం వంటివి చేసేవారని సమచారం. ఈ తరహా అక్రమాలు ఆలస్యంగా వెలుగుచూడడం, సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో పంచాయతీ ఆదాయ వనరుల్లో అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించేందుకు ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమవుతోంది. 'స్వర్ణ పంచాయతీ' వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. పంచాయతీల ఆదాయ, వ్యయాలకు సంబంధించిన లావాదేవీలను 'స్వర్ణ పంచాయతీ' పేరిట ఆన్‌లైన్ ద్వారా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏ రోజుకారోజు పంచాయతీకి ఎంత ఆదాయం వచ్చింది, ఎంత ఖర్చు అయ్యింది అన్నది తెలుస్తుంది. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాల మేరకు నివాస గృహాలకు సంబంధించిన పన్నుల సమాచారాన్ని ఆయా కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. 'స్వర్ణ పంచాయతీ' వెబ్‌సైట్‌లో ఇల్లు, షాపు, కంపెనీ, పరిశ్రమ విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు, ఏడాదికి ఎంత పన్ను చెల్లిస్తున్నారు వంటి వివరాలను నమోదు చేస్తారు. ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నుంచి పంచాయతీల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. పన్నుల చెల్లింపుతోపాటు పంచాయతీ ద్వారా జారీ అయ్యే వివిధ రకాల ధ్రువపత్రాలు, భవన నిర్మాణ అనుమతులు కూడా పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

ఆన్‌లైన్‌లోనే ఇంటి సమాచారం

ఇంటితోపాటు ఇంటి యజమాని ఆధార్ కార్డు, సెల్ నెంబర్, ఇంటి విస్తీర్ణం, ఇంటి హద్దులతో సహా వివరాలన్నీ సేకరించి నిక్షిప్తం చేసే పనిలో పంచాయతీ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఇంటి యజమాని దేశంలో ఎక్కడ ఉన్నా ఇంటి వివరాలు పంచాయతీ పోర్టల్‌లో వెళ్లి చూడవచ్చు. ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. గ్రామంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టే పనిలో పంచాయతీ సిబ్బంది నిమగ్నమై ఉన్నారు.

ఇంటి పన్ను నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు జమ

ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియ పంచాయతీ సిబ్బందికి అవకాశంగా మారింది. సిబ్బంది ఇంటి యజమాని వద్దకు నేరుగా వెళ్లి ఇంటి పన్ను వసూలు చేసి రసీదు ఇచ్చేవారు. ఇలా వసూలు చేసిన నగదు అదే రోజు బ్యాంకులో జమ చేయాల్సి ఉన్నా, ఎక్కడ చేయడం లేదు. కొద్దిరోజులు తమ వద్ద ఉంచుకొని సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని కొన్ని గ్రామాల్లో విమర్శలు వచ్చాయి. వీటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌ను రూపొందించింది. వసూలైన పన్నుల డబ్బు నేరుగా ప్రభుత్వానికి చేరుతుంది.

ఇంటి వివరాలు సరిచూసుకోండి

- జనార్ధన, ఎంపిడిఒ

స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో ఇంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. పంచాయతీలకు వెళ్లి ఇల్లు ఆన్‌లైన్‌లో ఉందో లేదో సరి చేసుకోవాలి. ఆన్‌లైన్ కాకుంటే చేసుకోవాలి.

ఇక ఆన్‌లైన్‌లోనే చెల్లింపు

- డిఎల్‌పిఒ తిమ్మక్క, ఆదోని డివిజన్

ఇంటి వివరాల ఆన్‌లైన్ నమోదు వేగవంతంగా సాగుతోంది. ఆగస్టు 30 నాటికి ముగిస్తాం. పాత బకాయిల వివరాలు పరిశీలించి, ఈ పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. దీని ఆధారంగా 2025–26 ఏడాదికి డిమాండ్ నోటీసులు ఇస్తాం. ఇకపై రసీదు వసూలు ఉండదు.

ఎమ్మిగనూరు డీఎస్పీగా భార్గవి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పోలీస్ సబ్ డివిజన్ డీఎస్పీగా మరివాడ భార్గవి బాధ్యతలు చేపట్టారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఆమె బాధ్య తలు స్వీకరించి మాట్లాడారు. తాను కొత్తగా పీటీసీలో ట్రైనింగ్ పూర్తి చేసుకుని ఎమ్మిగనూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో ఉన్న సమస్యలను సిఐలు, ఎస్ఐ ద్వారా తెలుసుకుంటున్నానని చెప్పారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదిం చవచ్చని, ఎలాంటి సిఫార్సులూ అవసరం లేదని తెలిపారు. తమ పోలీసు పరిధిలో చేయాల్సిన పనులను సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా చేస్తామని చెప్పారు. ఇక్కడి ప్రజలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అలాగే వలసలు వెళ్తున్నారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు, దొంగత నాలను నివారించడానికి, ప్రజల ఆస్తులను, ప్రాణాలను కాపాడటానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

రూ.కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులు : పిఆర్ డిఇ అశ్వత్థామ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని డివిజన్ పరిధిలో కోట్లాది రూపాయలతో గ్రామాలకు బిటి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని పిఆర్ డిఇ (పిఐయు) అశ్వత్థామ తెలిపారు. బుధవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న పనులను వివరించారు. ఎమ్మిగనూరు మండలం సొగనూరు రోడ్డు రూ.2 కోట్లు, మంత్రాలయం మండలం కల్వకుంట్ల–మేకడోన రూ.1.3 కోట్లు, ఆదోని మండలం 104 బసాపురం రూ.కోటి, జి.హోసళ్లి–బదినేహాల్ రూ.కోటి, కోసిగి మండలం మూగలదొడ్డి రూ.1.20 కోట్లు, నందవరం మండలం రూ.1.8 కోట్ల పనులు జరుగుతున్నాయని తెలిపారు.

కుళ్లిన కూరగాయలతో వంట చేయడానికి సహకరించిన

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి

-ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుందలోని కెజిబివి వసతి గృహంలో విద్యార్థులకు కుళ్లిన టమోటా, పాడైపోయిన ఉల్లిగడ్డలతో వంట వండించడానికి సహకరించిన ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున కోరారు. బుధవారం ఆయన మాట్లాడారు. పూర్తిగా పాడైన కూరగాయలతో విద్యార్థులకు భోజనాలు అందించడం దారుణమన్నారు. మారుమూల మండలం కావడంతో అధికారుల పర్యవేక్షణ కూడా కరువైందని తెలిపారు. ఇంతకుముందు కూడా ఇలా జరిగినా అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలతో నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

200 మంది విద్యార్థులు.. ఒక్కరే ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని మూగలదొడ్డి ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 202 మంది విద్యార్థులు ఉన్నారు. బుధవారం 202 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఒక్కరే విద్యను బోధించారు. గతంలో ఉన్న ఉపాధ్యాయులు బదిలీల్లో భాగంగా వేరే మండలానికి బదిలీపై వెళ్లారు. ప్రధానోపాధ్యాయులుతో పాటు మరో ఉపాధ్యాయులు ఉన్నారు. ఆ ఉపాధ్యాయురాలికి కూడా వేరే గ్రామానికి బదిలీ అయ్యారని, ఇక్కడ రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వలేదని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఉన్న ఒక్క ఉపాధ్యాయులు సెలవులో ఉండడంతో పాఠశాల ఆవరణలో విద్యార్థులు అటు ఇటు తిరుగుతూ, తరగతి గదుల్లో మరి కొంతమంది విద్యార్థులు ఉంటూ కాలక్షేపం చేసి ఇళ్లకు వెళ్లారు. దేశంలోనే నిరక్షరాస్యతలో రెండో స్థానంలో ఉన్న కోసిగి మండలంలో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్య కుంటుపడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామమే కాకుండా మండలంలో చాలా గ్రామాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. జిల్లా అధికారులు స్పందించి ఉపాధ్యాయులు లేని పాఠశాలలో పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేసి విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపాలని ప్రజలు కోరుతున్నారు.

బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

ఉపాధ్యాయులు లేక ఖాళీగా ఉన్న తరగతి గది

సమన్వయంతో సమస్యలు పరిష్కారం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. బుధవారం నందవరం తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యలను ప్రజాప్రతినిధులు ముందుకు తెస్తూ, అధికారులు సమయానుకూల చర్యలు తీసుకోవాలని తెలిపారు. పూలచింత గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పైపులైన్ మరమ్మతుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమ్మర్ స్టోరేజ్ పాయింట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలో రీసర్వే చేసిన ప్రాంతాల్లో 381 జాయింట్ ఎల్‌పిఎంలు ఉన్నాయని, భూసంబంధిత రికార్డులు సరిపోక పోవడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. జాయింట్ ఎల్‌పిఎంలపై ఇరుపక్షాలు కార్యాలయానికి వచ్చి అంగీకార పత్రాలు ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కోర్టు కేసులు ఉన్న భూ వివాదాలపై మాత్రం తీర్పు వెలువడే వరకు చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. గతంలో ఇంటి పట్టాలిచ్చిన లబ్ధిదారులకు ఇప్పటికీ భూమి పొజిషన్ చూపించని ఘటనలు ఉన్నాయని గుర్తించి, తహశీల్దార్‌కు పూర్తి విచారణ జరిపి పొజిషన్ చూపించాలని ఆదేశించారు. ఇంటి స్థలం లేని వారు సచివాలయం ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో శ్మశాన వాటికల కొరత ఉందని గుర్తించి, తగిన స్థలాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ పుల్లయ్య, ఏపీవో శ్రీనివాసులు, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మగతి ఈరన్న గౌడ్, మండల అధ్యక్షులు ఖాసీం వలీ, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మాధవరావు దేశాయ్, జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ పుష్పవతి, రైస్‌మిల్ నారాయణరెడ్డి, గజేంద్ర రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, ఐటిడిపి మండల అధ్యక్షులు వీరేష్ పాల్గొన్నారు.

నందవరంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరులో రేషన్ బియ్యం, నిత్యావసర సరుకుల నిల్వల గోడౌన్లను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పరిశీలించారు. బియ్యం నిల్వలు, పంపిణీ విధానం, భద్రత, రికార్డులు నిర్వహణను పరిశించారు. ఆయన మాట్లాడుతూ... అర్హులందరికీ రేషన్ బియ్యం, నిత్యావసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలని ఆదేశించారు. బియ్యం, జొన్నల బస్తాలను, బరువును తనిఖీ చేశారు. తహశీల్దార్ శేషఫణి, డిప్యూటీ తహశీల్దార్ వీరేంద్ర గౌడ్, పౌరసరఫరాల ఉప తహశీల్దార్ చంద్రకళ, విఆర్ఒ మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో గోడౌన్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి- దేవనకొండ

ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ తెలిపారు. బుధవారం దేవనకొండలో 'సుపరిపాలన తొలి అడుగు' నిర్వహించారు. ముందుగా స్థానిక బస్టాండ్ వద్ద ఆయనకు ఈదుల దేవరబండ సుభాన్ ఆధ్వర్యంలో క్రేన్‌తో గజమాల వేసి ఘన స్వాగతం పలికారు. ప్రధాన రహదారి వెంట వెళ్తూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ... దేవనకొండలో రూ.70 లక్షలతో సిసి రోడ్లు నిర్మించామన్నారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి టిడిపి ప్రభుత్వం కృషి చేసిందని, ఆలూరు ప్రాంతానికి సాగునీరందించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జీలను సన్మానించారు. టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, ఆకుల వీరేష్, మాలిక్ బాష, వెంకటస్వామి గౌడ్, రాజాసాబ్, రాజయ్య, వెలమకూరు, బేతపల్లి, చెల్లెల చెలిమల, గుడిమిరాళ్ల సర్పంచులు భాస్కర్, మహేశ్వర్ రెడ్డి, సిద్ధ రామప్ప, శేషి రెడ్డి, నాయకులు మస్తాన్, నాగేశ్వరరావు, పురుషోత్తం గౌడ్, రుద్ర, మహేష్, సతీష్, కిరణ్ కుమార్, రవి, వీరయ్య పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని ఇందిరా నగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మద్దికెర రామకృష్ణ, రాముడు, ఎంఎస్.వెంకటేశులు, ఎంఎస్.రామాంజనేయులు, ఎంఎస్.నరేష్, గోలెం రాజు, ఎంఎస్.విజయ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. మాజీ కౌన్సిలర్ రామచంద్ర, ఫక్రుద్దీన్, బుద్ధారెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, సోమశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఇస్వి శ్రీనివాసులు, మల్లేశ్వరప్ప, బి.నాగరాజు, బీటీ.శీనా, నారా యణపురం షాషావలీ, ఎమ్‌డి.హుస్సేన్, మదిరే శ్రీనివాస్, వాల్మీకి రాముడు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరిస్తున్న వీరభద్ర గౌడ్



ఆదోనిలో కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

ఇస్కాన్ టెంపుల్‌కు దాతల సహకారం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఇస్కాన్ టెంపుల్‌కు దాతలు సహాయ, సహకారాలు అందించారు. మండలంలోని కపటి గ్రామంలో మోహన్ రెడ్డి ట్రేడర్స్ ఫామ్ హౌస్ ఎదురుగా ఇస్కాన్ టెంపుల్ నిర్మించడానికి మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి 58 సెంట్లు స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. మోహన్ రెడ్డి స్థలదాతలు కలిసి 120 సెంట్లు మొత్తం 1.78 సెంట్లలో దేవాలయాన్ని నిర్మించేందుకు దేవాలయం పెద్దలకు బుధవారం స్థలాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడారు. దేవాలయాన్ని త్వరగా పూర్తి చేయాలని, దేవాలయ నిర్మాణంలో పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారవేత్తలు భాగస్వాములై నిర్మించాలని కోరారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఇస్కాన్ కిరణ్, చంద్రశేఖర్, సురేష్, బసవన్న గౌడ్, ప్రతాప్ స్వామి, విరుపాక్షి స్వామి, వైసిపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, అశోక్ నందరెడ్డి, సుబ్బారెడ్డి, గుర్రెడ్డి పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న విలేకరి

ప్రజాశక్తి - మంత్రాలయం

తన భార్య ఖాతాలో జమ అయిన ఇతరులకు చెందిన డబ్బును ఎస్ఐ శివాంజల్ చేతుల మీదుగా అప్పగించి ఈనాడు విలేకరి శ్రీధర్ స్వామి నిజాయితీ చాటుకున్నారు. స్థానిక శ్రీపరిమళ విద్యానికేతన్‌లో సుధామణి, శ్రీధర్ స్వామి దంపతుల కుమార్తె జె.హరిప్రియ 3వ తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో చదువుతున్న నందవరం మండలం నదీకైరవాడికి చెందిన సుజాత కుమారుడు గణేష్‌కు చెందిన 'తల్లికి వందనం' డబ్బులు రూ.13 వేలు సుధామణి బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. అప్పటికే సుధామణి, శ్రీధర్ స్వామి దంపతుల ఇద్దరు పిల్లలకు చెందిన రూ.26 వేలు జమ అయ్యాయి. అదనంగా మరో రూ.13 వేలు జమ అయిన విషయం గ్రహించి పాఠశాలకు వెళ్లి విచారించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గణేష్‌కు చెందిన రూ.13 వేలు సుధామణి ఖాతాలో జమ అయినట్లు గణేష్ తల్లి సుజాతకు బుధవారం పాఠశాలలో ఎస్ఐ శివాంజల్ చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవ దేశాయ్ ఉన్నారు.

బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

- బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఎస్సీ, ఎస్టీల తరహాలో బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో దస్తగిరి నాయుడు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చి దాదాపు 18 నెలలు కావస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. వెంటనే రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ హాస్టళ్లకు నూతన భవనాలు ఏర్పాటు చేయాలని, ఉన్న వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. డివిజన్ ఉపాధ్యక్షులు ఢణాపురం శేషన్న, రిటైర్డ్ తహశీల్దార్ పి.షేక్షావలీ, డివిజన్ గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, ఆదోని పట్టణ అధ్యక్షులు డాక్టర్ వీరేష్, తాలూకా గౌరవ సలహాదారులు, కపటి వీరభద్ర, బి.రాముడు, జాయింట్ సెక్రటరీ బి.వెంకటేష్, పట్టణ గౌరవ సలహాదారులు రిటైర్డ్ ఉపాధ్యాయులు రామలింగప్ప, నల్లారెడ్డి, బెస్త ప్రకాష్, పట్టణ జాయింట్ సెక్రటరీ బి.చిన్న ఈరప్ప, దీపక్ కుమార్, పగడాల కిరణ్ కుమార్, కత్తి ప్రసాద్, ఈసీ మెంబర్ తరుణ్ కుమార్, కౌతాళం మండల అధ్యక్షులు వీరేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దస్తగిరి నాయుడు

శ్రీమఠంలో నంద్యాల కలెక్టర్ రాజకుమారి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆలయ ప్రాంగణంలో ఉన్న నంద్యాల కలెక్టర్ రాజకుమారి

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామిని నంద్యాల కలెక్టర్ రాజకుమారి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుధేంద్రతీర్థులు వారికి చీర రవిక అందజేసి ఆశీర్వదించారు. తహశీల్దార్ కె.రమాదేవి, ఆర్ఐ జనార్ధన్ రావు, కానిస్టేబుల్ రాముడు పాల్గొన్నారు.

హామీలు మరిచిన కూటమి ప్రభుత్వం

- వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిందని వైసిపి జిల్లా కార్యదర్శి మురళీమోహన్ రెడ్డి విమర్శించారు. బుధవారం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కోల్మన్ పేట గ్రామంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' నిర్వహించారు. సర్పంచి గులిగేని జయరాం అధ్యక్షతన గ్రామంలో ప్రతి గడపకూ తిరుగుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను వివరిస్తూ, అమలు చేయని సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపిపి పెండేకల్లు ఈరన్న, వైసిపి నాయకులు బసిరెడ్డి, నాగేష్, అంజి, ప్రతాప్, నరసింహులు, హనుమంతు, గోపాల్, రమేష్, రామాంజి, ఈరన్న, అనుమేష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని 24వ వార్డులో వైసిపి వార్డు ఇన్‌ఛార్జీ రుద్రాక్షల బజారి, కౌన్సిలర్ రామాంజనమ్మ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' నిర్వహించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకొని కరపత్రాలను పంపిణీ చేశారు. వైసిపి నాయకులు డి.నజీర్ అహ్మద్, శివ ప్రసాద్, బజారి రెడ్డి, శ్రీనివాస రెడ్డి, గడ్డం అంజి, అల్తాఫ్, మద్దిలేటి, గోర్వ మాబాషా, జేరుబండి రఘువీర్, నరేష్, సలీం, గడిగే చంద్ర, సయ్యద్ ఫయాజ్, బోయ సోమేష్, మాచాని రఘు, రవి చంద్ర, నారాయణ స్వామి, బొబ్బతి నాగరాజు, రామచంద్ర రెడ్డి, గురుప్రసాద్, రమేష్, ఖాజా, వెంకటేష్, చంద్రమోహన్ రెడ్డి, చాంద్ బాషా, ఓబులేసు, మోహన్, కదిరికోట రాజు, జశ్వంత్ పాల్గొన్నారు.

కోసిగిలో క్యూఆర్ స్కానర్లను గ్రామస్తులకు ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరులో కరపత్రం ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - కోసిగి

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న జరిగే 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రాముడు, యూనియన్ నాయకులు మిన్నప్ప, యూనిస్ బాష, సిఐటియు ఉపాధ్యక్షులు వీరేష్ కోరారు. బుధవారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ముందు 'చలో విజయవాడ' గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, 2022 అరియర్స్ ఇవ్వాలని కోరారు. మీటర్ రీడర్లకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. ఆగస్టు 7న విజయవాడలో జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గోపాల్, మర్రి స్వామి, కతలయ్య, పోతప్ప, రామ కృష్ణ, భీమయ్య, శేఖర్, హుస్సేని, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోడపత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

IN THE COURT OF THE CIVIL JUDGE:: ADONI
(SENIOR DIVISION)
I.P. No.02/2024

Between :
Boya Mandagiri Krishnamraju. …Petitioner
-Vs-
1. Boya Gudigineni Maddileti. …Respondents
2. Boya Chenna Keshavulu
3. Sandoli Rangappa Raju
4. Pandikona Chinna Peddaiah

GENERAL NOTICE

Whereas the above name petitioner filed petitioner U/Sec x (2) R/w 13 of provincial insolvency act to declare the petitioner as insolvent. Hence anybody wants any objections with regard to the above petition are hereby appear before this court on 31.07.2025 at 10:30 AM and file objections if any otherwise the petition will be decided on merits.

(By Court Order)
Sri. N. KRISHNAIAH,
Sri. K. SUDHAKAR RAO,
Advocates, Adoni.
Mobile : 9885471917

మహారాజశ్రీ నంద్యాల మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు, కర్నూలు at నంద్యాల
I.A. No. 1216/2025 in O.S. No. 28/2014

(1). లింగం ఎలిజిబెత్ రెబెక లీలావతి మరియు 10 ఇతరులు .....పిటిషనర్లు/వాదులు
-versus-
(1). లింగం జాన్ డేవిడ్ రజని మరియు 29 ఇతరులు ....రెస్పాండెంట్లు/ప్రతివాదులు

ఇంప్లీడ్ పిటిషన్ I.A. No. 1216/2025 in O.S. No. 28/2014 లోని 1,2,3 వ రేస్పాండెంట్లులకు పిటిషన్ నోటిసులు

1) 1 వ రెస్పాండెంట్ : లింగం జాన్ డేవిడ్ రజని, భర్త ఎల్.యస్.డి. ప్రభాకర్, (లేట్) ఇండియన్, క్రిస్టియన్, రిటైర్డ్ నర్సు,
2) 2 వ రెస్పాండెంట్ : లింగం జాన్ డేవిడ్ ప్రవీణ్ కుమార్, తండ్రి ఎల్.యస్.డి. ప్రభాకర్ (లేట్) ఇండియన్, క్రిస్టియన్, బిజినెస్,
3) 3 వ రెస్పాండెంట్ : లింగం జాన్ డేవిడ్ పరిమల్ కుమార్, తండ్రి ఎల్.యస్.డి. ప్రభాకర్ (లేట్) ఇండియన్, క్రిస్టియన్, బిజినెస్, పై ముగ్గురి రేస్పాండెంట్ల నివాసము : ఇంటి నెం. B/C/47/B, బి.క్యాంపు, కర్నూలు టౌన్ మరియు జిల్లా,

పై దావా లోని స్థిరాస్తి లోని కొంత భాగాల పైన, దావా పెండింగు దశలో లావాదేవీలు జరిపిన వ్యక్తులను, సదరు దావాలో ప్రతివాదులు గా చేర్చమని గౌరవ కోర్టు వారిని కోరుతూ, పిటిషనర్లు/వాదులు, ఇంప్లీడ్ పిటిషన్ I.A. No. 1216/2025 in O.S. No. 28/2014ను దాఖలు చేయగా, సదరు పిటిషన్‌లో రెస్పాడెంట్లుగా ఉన్న మీకు పిటిషన్ నోటీసులను కోర్టు మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా మీకు అనేక మార్లు పంపిననూ, మీరు అనేక మార్లు తీసుకొనక పోవడం వలన, గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ నోటిసులు పత్రికా ముఖముగా ప్రకటించి, మీకు తెలియజేయడం ఏమనగా, పైన తెలిపిన పిటిషన్ లోని అంశాలపైన మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల 05.08.2025 వ తేదీన ఉదయం 10.30 గంటలకు మీరు వ్యక్తిగతముగా గానీ, లాయర్ల ద్వారా గానీ, పైన తెలిపిన గౌరవ కోర్టు వారి యందు హాజరు అయి తెలుపుకోవలెను. అట్లు రానంతట, పైన తెలిపిన ఇంప్లీడ్ పిటిషన్ ను మీ పరోక్షమందు, గౌరవ కోర్టు వారు తీర్మానించెదరు.

(గౌరవ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా : 05.08.2025 సమయం : ఉదయం 10.30 గం॥

ఇట్లు
ఎస్.వి.యన్. హరి ప్రసాద్ రెడ్డి,
పిటిషనర్లు/వాదుల తరపున అడ్వకేట్
నంద్యాల, సెల్ నెం. 9848147132



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధ్యాయులను నియమించాలి : సిపిఎం

ప్రజాశక్తి - హోళగుంద

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని సిపిఎం నాయకులు కోరారు. బుధవారం హోళగుందలో సిపిఎం ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు వెంకటేష్, నాగరాజులు ఇన్‌ఛార్జీ ఎంఇఒ కబీర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ గ్రామాల నుంచి దాదాపు 1,780 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. 65 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన ఈ పాఠశాలలో 23 మంది మాత్రమే ఉన్నారని, భోజనశాలకు ఒక షెడ్డు నిర్మించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కూలిలు పెంచాలని, విద్యార్థులకు యూనిఫారం, పుస్తకాలు అందించాలని కోరారు. తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, బోరు నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. చెడిపోయిన వాటర్ ప్లాంట్‌ను బాగు చేయించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీల

స్థల పరిశీలన చేస్తున్న అధికారులు నాయకులు

ప్రజాశక్తి - కోసిగి

వాల్మీకి సర్కిల్ పక్కన ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్‌కు స్థలాన్ని పరిశీలించారు. బుధవారం సర్పంచి అయ్యమ్మ ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రమోహన్, డిఇ వెంకటేశ్వర్లు, ఎఇ విరుపాక్షి, టిడిపి సీనియర్ నాయకులు రామిరెడ్డి స్థలాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా.. పేదల ఆకలి తీర్చేందుకు రూ.5 భోజనంతో ఏర్పాటు చేసే ఈ అన్న క్యాంటీన్లను రూ.61 లక్షలతో ఏర్పాటు చేస్తోందన్నారు. రోజూ మూడు పూటల రూ.5లకే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం దొరుకుతుందని తెలిపారు. ఆకలి తీర్చడమే అన్న క్యాంటీన్ల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రస్తుత సమాజంలో బయట హోటల్‌లో రూ.100 నుంచి రూ.150 పెట్టే భోజనం కేవలం రూ.5లకే ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. టిడిపి నాయకులు తోవి రామకృష్ణ, వక్రాణి వెంకటేశ్వర్లు, హోళగుంద కోసిగయ్య, హీరో షోరూం వీరేష్, రాజేష్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఏర్పాటు చేయండి

- ఎంఆర్‌పిఎస్, పిఎస్‌యు

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని పూలచింత గ్రామానికి 18 ఏళ్ల క్రితం ఇచ్చిన రెండెకరాల స్థలంలో 16ఎ సర్వే నెంబర్ ఏర్పాటు చేయాలని ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పెద్దయ్య, పిఎస్‌యు జిల్లా కార్యదర్శి సురేష్ కోరారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో వెయ్యి కుటుంబాలు, రెండు వేలకు పైగా ప్రజలు గ్రామంలో నివాసం ఉంటున్నారని, శ్మశాన స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామానికి శ్మశాన స్థలం కోసం పలుమార్లు అధికారులను కోరినా జాప్యం చేస్తున్నారని చెప్పారు. ఆయన స్పందించి... 17 రోజుల్లోపు సమస్య పరిష్కరించాలని మండల అధికారికి వివరించినట్లు తెలిపారు. ఉప సర్పంచి సుధాకర్, నరసింహులు, చిన్నరాజు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంత్రాలయంలో 'ప్రయివేట్' దోపిడీ

- రద్దీని అనుసరించి టికెట్ల ధరల పెంపు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ప్రయివేట్ బస్సుల జోరు కొనసాగుతోంది. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. గురు, శని, ఆదివారాల్లో ఒక్క బెంగళూరు ప్రాంతం నుంచి సుమారు 53 ప్రయివేట్ బస్సులు మంత్రాలయానికి వస్తున్నాయి. ఇవి కూడా కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన బస్సులు సుమారు 22, ఎపికి చెందిన బస్సులు 4 వస్తున్నాయి. ఇక ప్రయివేట్ బస్సులు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టికెట్ ధరలు పెంచి దోపిడీ చేస్తున్నాయి. ఇందులో బెంగళూరుకు కర్ణాటక ఆర్‌టిసి రెడ్ బస్సు టికెట్ ధర రూ.580, సోమవారం నుంచి గురువారం వరకు నాన్ ఎసి స్లీపర్ టికెట్ ధర రూ.817, ఐరావతం మల్టీ ఎక్సెల్ సెమీ స్లీపర్ ఎసి టికెట్ ధర రూ.950, రాజహంస పుష్ బ్యాక్ సీట్ టికెట్ ధర రూ.665, అంబారీ ఉత్సవ్ ఎసి స్లీపర్ టికెట్ ధర రూ.1,084గా ఉన్నాయి. ఎపి నుంచి మూడు బస్సులు ఉండగా సూపర్ లగ్జరీ రూ.670, ఎక్స్‌ప్రెస్ రూ.590 ఉన్నాయి. ప్రయివేట్ బస్సులు మాత్రం ఎంత పడితే అంత అవకాశాన్ని బట్టి భక్తుల వద్ద నుంచి వసూలు చేస్తున్నారు. వీటిపై రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారుల నిఘా ఉందా లేదా అనే విషయం అర్థం కావడం లేదు. మంత్రాలయంలోని ప్రధాన రహదారిలో ముఖ్యంగా పోలీసు స్టేషన్ ముందు రోడ్డును ప్రయివేట్ బస్టాండ్‌గా మార్చినా.. ప్రశ్నించే అధికారులు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయివేట్ బస్సుల నిర్వాహకుల నుంచి భక్తుల దోపిడీని అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

అన్న క్యాంటీన్లలో శుచి, రుచి ఉండాలి

పాత బస్టాండ్ అన్న క్యాంటీన్ కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అన్న క్యాంటీన్లలో ఆహార పదార్థాలు శుభ్రంగా, వేడిగా, రుచిగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నక్యాంటీన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కర్నూలు పాత బస్టాండులో ఉన్న అన్న క్యాంటీన్‌ను నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథతో కలిసి కలెక్టర్, ఆకస్మికంగా తనిఖీ చేశారు.కలెక్టర్ అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వారితో మాట్లాడారు. ప్రతి రోజు భోజనం ఇక్కడే చేస్తారా?.. భోజనం రుచిగా, శుచిగా ఉందా?, అని ఆరా తీశారు. వారు స్పందిస్తూ ప్రతి రోజు ఇక్కడే భోజనం చేస్తామని, భోజనం నాణ్యతగా, రుచిగా ఉంటుందని కలెక్టర్‌కు తెలిపారు. అన్న క్యాంటీన్ సిబ్బందితో మాటాడుతూ ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయంలో ఎంతమంది భోజనం చేస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు..అన్న క్యాంటీన్‌లో మంచి భోజనం అందించడంతో పాటు శుభ్రత పాటించాలని, సకాలంలో భోజనం అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. బయట కింద కూర్చొని భోజనం చేస్తున్న వారి కొరకు టేబుల్ లను ఏర్పాటు చేయించాలని కలెక్టర్ కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా అన్న క్యాంటీన్ పరిసరాలలో పూలు అమ్ముకునే వారితో కూడా మాట్లాడారు. పూలు ఎక్కడి నుంచి తీసుకొచ్చి అమ్ముతారు? ప్రతిరోజు అన్న క్యాంటీన్లో భోజనం చేస్తారా? భోజనం రుచి ఏ విధంగా ఉందా ? ఏమైనా పెన్షన్ వస్తుందా ?అని కలెక్టర్ వారిని ఆరా తీశారు. వారు స్పందిస్తూ పూలు బెంగళూరు నుండి తీసుకొచ్చి అమ్ముతామని, ప్రతిరోజు అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తామని, భోజనం చాలా రుచిగా ఉంటుందని కలెక్టర్‌కు తెలిపారు. అర్హత ఉండి పెన్షన్ ఎవరికైనా రాకపోతే వెంటనే దరఖాస్తు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కలెక్టర్ పూల మార్కెట్‌ను పరిశీలిస్తూ ఇక్కడ మొత్తం ఎన్నిషాప్ లు ఉన్నాయి? మున్సిపాలిటీ వారు పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు ఏ విధంగా చేస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అన్ని క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న వ్యక్తితో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

సూదిరెడ్డిపల్లిలో సంచార చికిత్సాలయం తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సూదిరెడ్డిపల్లీ గ్రామంలో జరుగుచున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులు ఎవరైనా డయేరియా వ్యాధితో బాధపడుతున్నప్పుడు తప్పనిసరిగా ఒఆర్ఎస్, జింక్ మాత్రలను ఇవ్వాలని సిబ్బందికి సూచించినారు. ఒఆర్ఎస్, జింక్ మాత్రల వినియోగమంపై ఇంటింటా అవగాహన కల్పించారు. అతిసారా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు తల్లిపాలు ఇస్తూ ఒఆర్ఎస్, జింక్ మాత్రలను తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. విరేచనాలు తగ్గిన తరువాత ఒఆర్ఎస్ వినియోగించరాదని, జింక్ మాత్రలు 14 రోజుల పాటు చిన్నారులకు వేయాలని సూచించినారు. రెండు నెలల నుంచి ఆరు నెలల లోపు చిన్నారులకు చనుపాలలో మాత్రా కలిపి 10 మిల్లీ గ్రాములు (అర మాత్ర) వైద్యుల సూచనల మేరకు ,6 నెలలు దాటిన వారికి ఒక మాత్రా పరిశుభ్రమైన నీటిలో, తల్లిపాలలో కలిపి ఇచ్చినచో అతిసార వ్యాధిని నియంత్రించవచ్చునని వివరించినారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ,ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు అంగన్వాడీ కేంద్రాల్లో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమములో వైద్యులు డాక్టర్ అబ్దుల్ అనీద్, సామాజిక ఆరోగ్య అధికారి జయనాగమణి, పిహెచ్ఎన్ హనుమంతమ్మ, క్షేత్రస్థాయి పర్యవేక్షకురాలు నాగమణి, ఆరోగ్య కార్యకర్త రెహేన, ఆశా కార్యకర్త మరియు ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు

పండ్ల మొక్కలు నాటించండి

- ఏపీవో రాజునాయక్

ప్రజాశక్తి - దేవనకొండ

ఉపాధి హామీ చట్టం కింద పండ్ల మొక్కలు మంజూరైన రైతులతో క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు త్వరగా నాటించాలని ఏపీవో రాజు నాయక్ సూచించారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండ్ల మొక్కలు మంజూరైన ప్రతి రైతులతో వారంలోపు గుంతలు తీసి మొక్కలు నాటించాలని తెలిపారు. పని పూర్తయిన వాటికి రైతులకు పేమెంట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. హౌసింగ్, పశువుల షెడ్లు, పశువుల నీటి తొట్టెలకు సంబంధించిన నిధులు త్వరగా జమ చేయాలని తెలిపారు. ఈసీ గంగన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీవో రాజునాయక్

మృతి చెందిన లక్ష్మి

భర్త చేతిలో భార్య మృతి

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన వివాహిత దుద్ది ఈరన్న గారి లక్ష్మి (49) బుధవారం భర్త దుద్ది ఈరన్న గారి నరసింహులు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు, బంధువుల వివరాల మేరకు... నరసింహులుకు మతిస్థిమితం సరిగా లేదని తరచూ భార్యాభర్తలు గొడవ పడేవారని తెలిపారు. గొడవలో కోపోద్రిక్తుడైన భర్త పొడవాటి కర్రతో లక్ష్మి తలపై దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయారు. చికిత్స నిమిత్తం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలింరగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

11 న జిల్లా స్థాయి యోగా టోర్నమెంట్

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

ఆగస్టు 11న కర్నూలు జిల్లా స్థాయి యోగా టోర్నమెంట్ కమ్ సెలక్షన్‌ను కర్నూలులోని అవుట్‌డోర్ స్టేడియం యోగాహాలులో నిర్వహిస్తున్నట్లు కర్నూలు యోగా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవినాష్ శెట్టి, మునిస్వాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలను బాలబాలికల స్త్రీ, పురుషుల విభాగంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు చివరి వారంలో వెస్ట్‌గోదావరి జిల్లా వేదికగా జరగబోయే 50వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగంలో కర్నూలు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు రూ.50 ప్రవేశ రుసుంతో నేరుగా హాజరు కావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7732089440 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నానో యూరియాపై అవగాహన

ప్రజాశక్తి-సి బెళగల్

నానో యూరియా నానో డిఎపి వాడకం పూర్తిగా తగ్గించాలంటూ ఎడిఎ సాలు రెడ్డీ రైతులకు సూచించారు. బుధవారం బ్రాహ్మణదొడ్డిలో ఎఒ మల్లేష్ కుమార్ పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఎడిఎ సాలురెడ్డి పర్యవేక్షణ చేపట్టి నానో యూరియా, నానో డిఎపి వాడకం వలన పంటలకు భూసారం తగ్గిస్తుందన్నారు. భూమి గరుకుగా మారి పోతుందన్నారు. పత్తి సాగులో పచ్చదోమ, గులాబీ రంగు పురుగు, తెల్లదోమ, పేనుబంక ఉధృతి పెరుగుతుందని నివారణలో అలసత్వం తగదని కోరారు. అంతేకాకుండా ఉద్యానవన అధికారి మదన్మోహన్ ఉల్లిపంటపై, ఉద్యాన పంటలను సాగు చేయుటలో మెలకువలు పాటించాలని తెలిపి మినుము విత్తనాల కిట్స్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హిమబిందు, హనీఫ్, వెంకటేశ్వర్లు, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

త్వరలో మరో పెట్రోల్ బంకు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

19వ వార్డు జోహరపురం రోడ్డున నగరపాలక సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని, వచ్చే వారంలో పంప్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. బుధవారం ఆయన పెట్రోల్ పంప్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. బుధవారపేటలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. బుధవారపేట దామోదరం సంజీవయ్య పార్కులో సౌకర్యాలపై స్థానికులను ఆరా తీశారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంచార్జీ ఎఇ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, డిఇఇ నరేష్, ఎఇ జనార్ధన్, పారిశుధ్య తనిఖీదారులు రమేష్, హుస్సేన్, మునిస్వామి,పాల్గొన్నారు.

సిపిఐ మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

ఆగష్టు 9,10,11 తేదీలలో కర్నూలులో జరిగే సిపిఐ కర్నూలు 24వ జిల్లా మహాసభల గోడ పత్రికలను ఆహ్వాన సంఘ జిల్లా అధ్యక్షులు కె జగన్నాథం, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప ఆవిష్కరించారు. ఈ కార్య క్రమంలో సిపిఐ కర్నూలు నగర సహాయ కార్యదర్శి జి.చంద్రశేఖర్, సి.మహేష్, నగర కార్యవర్గ సభ్యులు వెంకటేష్, బీసన్నకుమార్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఎపి మహిళా సమాఖ్య నగర కార్యదర్శి వి .భారతి పాల్గొన్నారు.

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : రైతులకు సాంకేతిక సమాచారం వ్యవసాయంలో అందించడానికి పొలం పిలుస్తోంది. కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని కోడుమూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమాన్ని మండలంలోని రైతులు వినియోగించుకోవాలని అన్నారు. పత్తి, కంది పంటలలో నానో యూరియా ఎకరానికి 500 ఎంఎల్ చొప్పున స్ప్రే చేసుకోవాలన్నారు.

పాఠశాలను సందర్శించిన హజ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూల్ నగరంలోని 48వ వార్డులోని కారల్ మార్క్స్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్‌ను రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్అలీఖాన్ సందర్శించి అక్కడి విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి, శుభ్రత, డైలీ మెనూ పై ఆరా తీశారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో రాజీ పడకుండా నాణ్యత పాటించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి లోకేష్, మంత్రి టీజీ భరత్.. విద్య పట్ల, పాఠశాలలో అందుతున్న వస్తువుల పట్ల, మధ్యాహ్న భోజనం, పాఠశాలలలో ఆహార ఏర్పాట్లు పట్ల శ్రద్ధ వహిస్తున్నారని వివరించారు.

సిల్వర్ సెట్ కౌన్సిలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సిల్వర్ సెట్ కౌన్సెలింగ్ బుధవారం క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. అనంతరం రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిల్వర్ జూబ్లీ కళాశాల అంటే ఒక బ్రాండ్ అని ఇక్కడ చదివిన ప్రతి ఒక్కరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అన్నారు. సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాస్ మాటాడుతూ ఇక్కడ సీటు పొందిన విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని విద్యాలయానికి, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సిల్వర్ సెట్ లో రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థిని జాహ్నవికి రిజిస్ట్రార్, ప్రిన్సిపల్ సీట్ అలార్ట్ మెంట్ అర్హత పత్రం అందజేశారు. సెట్ కన్వీనర్ డాక్టర్ వాయిజ్ మాట్లాడుతూ మొదటి రోజు 120 మంది కౌన్సిలింగ్ కి హాజరయ్యారన్నారు. ఒక్క సీటుకు ముగ్గురు చొప్పున కౌన్సెలింగ్ కు పిలిచామని దాంట్లో బిఎ హిస్టరీలో 22 సీట్లకు 22 మందికి సీట్లు కేటాయించామన్నారు. ఎకనామిక్స్‌లో 22 సీట్లకు 22 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించా మన్నారు. నిర్ణీత గడువులో కౌన్సిలింగ్ వచ్చిన వారికే సీట్లు కేటాయిస్తామని రానివారికి ఉండవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.ప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు ఎల్లా కృష్ణ, ఫామీదబేగం , ఓబులేసు, రాజశేఖర్, నాగన్న, నరేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

సిల్వర్‌సెట్ కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు

కూటమి ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షం

పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్

ప్రజాశక్తి-పత్తికొండ

కూటమి ప్రభుత్వంలో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం పత్తికొండ పట్టణంలోని 20వ వార్డులో ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మై టిడిపి యాప్‌లో స్వయంగా వారి సమస్యలను నమోదు చేశారు. తొలి అడుగులో భాగంగా వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పండించిన పంటలకు మద్దతు ధరలు, పంటబీమా, ఉచిత ఇసుక, పెంచిన పెన్షన్లు, ఆరోగ్యశ్రీ, పిహెచ్ సిల్లో మెరుగైన సేవలు ,విద్యార్థులకు తల్లికి వందనం , స్కూళ్ల ఆధునికీకరణ, మహిళలకు డ్వాక్రా బలోపేతం, ఉచిత రేషన్, మహిళా భద్రత, యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ అవకాశాలు, తాగునీటి పథకాలు, గ్రామీణ రహదారుల అభివృద్ధి, స్మార్ట్ గ్రామాల దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీధర్‌రెడ్డి, పర్ల ప్రకాష్,మధు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యామ్‌కుమార్

పంటల నమోదును పరిశీలిస్తున్న ఎఒ

ప్రజాశక్తి-మద్దికేర

ప్రతి రైతూ బాధ్యతగా పంట నమోదు చేసుకోవాలని, పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే అన్ని సంక్షేమ పథకాలకు అర్హులుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మండల వ్యవసాయ అధికారి,రవి అన్నారు. మండల కేంద్రమైన మద్దికేర గ్రామంలో బుధవారం ఆయన పర్యటించి పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వం ప్రకటించే నిర్దిష్ట ధరకు ధాన్యం అమ్ముకోవచ్చని, పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు. కౌలు రైతులు, డి.పట్టా, ఆర్ఒఎఫ్ఆర్ పట్టా భూములు కలిగిన రైతులు కూడా పంటల నమోదుకు అర్హులేనని తెలిపారు. ప్రతి రైతూ ఏయే సర్వే నెంబర్‌లో ఏయే పంటలు సాగు చేస్తున్నారో, ఆ పంటలను గ్రామ రైతు సేవా కేంద్రంలో పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ ఆనంద నాయక్ రైతు పోతుగంటి మాదన్న తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలిస్తున్న ఎఒ

పంట నమోదు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో ఉన్న ప్రతి రైతూ పంట నమోదు చేసుకోవాలని ఎఒ వరప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని పల్లెపాడు, చింతకుంట గ్రామాల్లో పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట నమోదును డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. రైతులు ఇన్స్యూరెన్స్, పంట నష్టం, బ్యాంకు రుణం తదితర పథకాల్లో లబ్ధి పొందటానికి పంట నమోదు ప్రామాణికమని తెలిపారు. అలాగే ఉల్లి, కంది, జొన్నలు, మిరప, సజ్జలు, కొర్ర వేసిన రైతులు స్వచ్ఛందంగా ఇన్స్యూరెన్స్ ప్రీమియం కట్టేందుకు గురువారం చివరిరోజు అని, మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హోమంలో పాల్గొన్న స్థానికులు

సుబ్రమణ్య స్వామికి సామూహిక హోమం

ప్రజాశక్తి-మద్దికేర

మండల కేంద్రమైన మద్దికేర మద్దమ్మ కుంట గట్టుమీద వెలసిన సంతాన వరుడు ఆరోగ్య ప్రదాత కోరి కొలిచిన వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఆలయ నిర్వాహకులు విజయ్ ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో స్వామివారికి మాస షష్టి హోమం, పంచామృత అభిషేకాలు, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తాదులకు కమ్మటి విందు భోజనం ఏర్పాటు చేశారు. నిర్వాహకులు విజయ్ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో షష్టి సందర్భంగా స్వామివారికి సామూహిక అభిషేకాలు నిర్వహించారు. జాతకంలో ఆశ్లేష నక్షత్ర దోషం కుజదోషం, రాహుకేతు నివారణ ఉద్యోగ విద్య వ్యాపార అభివృద్ధి కొరకు వివాహ సంతాన ఆరోగ్య సమస్యల కొరకు సామూహిక హోమాలు విశేష పూజలు అర్చనలు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.